క్లుప్తంగా

కరపత్రాల ఆవిష్కరణ



ఉత్సవాల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న చైర్మన్ ప్రవీణ్‌కుమార్ తదితరులు

ముమ్మిడివరం: ఆదుర్రు బుద్ధవిహార్‌లో జరిగే బుద్ధ జయంతి వారోత్సవాలను జయప్రదం చేయాలని నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలో బుధవారం బుద్ధ విహార్ ట్రస్టు, బుద్ధిస్టు సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు ఎస్ఎస్ ఆర్ భూపతి ఆధ్వర్యంలో ఈ వారోత్సవాల కరపత్రాలను ప్రవీణ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భూపతి మాట్లాడుతూ గౌతమ బుద్ధుని బోధనలతో మానవునికి సత్ప్రవర్తన, హేతుబద్ధమైన జీవనం అలవడుతుందన్నారు. కార్యక్రమంలో బుడితి శరత్, దప్పు మూర్తి, ఈవీవీ సత్యనారాయణ, ఎస్.పృథ్వీరాజ్, చింతపల్లి శివకుమార్, జుత్తుక సతీష్ పాల్గొన్నారు.

క్రాస్ బండ్ పనుల పరిశీలన



ఫ్రెంచి కెనాల్ వద్ద క్రాస్ బండ్ పనులను పరిశీలిస్తున్న ఆర్ఏఓ మునిస్వామి

యానాం: పిల్లంక- బ్రహ్మపురి మధ్య ఫ్రెంచ్ కెనాల్ వద్ద క్రాస్ బండ్ నిర్మాణ పనులను బుధవారం ఆర్ఏఓ మునిస్వామి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామన్నారు. ఫ్రెంచి కెనాల్ నుంచి వచ్చే నీటి ప్రవాహం బాగా తగ్గిందని, ఈ నేపథ్యంలో ఆ ప్రదేశంలో క్రాస్‌బండ్ నిర్మిస్తున్నామన్నారు. అక్కడి నుంచి మోటార్‌ల ద్వారా నీటిని ఫ్రెంచ్ కెనాల్ కాలువలోకి ఎత్తి పోస్తామన్నారు. కీలకమైన శుంకర పాలెం-యానాం బైపాస్‌ను చేర్చి ఉన్న 55 ఎకరాల చెరువులను పూర్తి స్థాయిలో నింపుతున్నట్లు తెలిపారు.

సమస్య పరిష్కారానికి కృషి

ఉప్పలగుప్తం: చల్లపల్లి గ్రామంలోని ఓ వీధిలో వర్షపునీరు దిగక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మహిళలు ఫిర్యాదు చేయటంతో బుధవారం ఎంపీడీఓ కేఎస్ గౌరీకుమారి పరిశీలించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన అన్నారు. పంచాయతీ కార్యదర్శి పెట్టా నాగేశ్వరరావు, పీఆర్ ఏఈ వి.రాధాకృష్ణ, ఏపీఓ వి.రాజామణి, సీనియర్ అసిస్టెంట్ డీవీ ఎల్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు రేపు సత్కారం

యానాం: పుదుచ్చేరి ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక కలైమామణి అవార్డులను అందుకున్న యానాంకు చెందిన నలుగురిని 5న భారతీయ దళిత సాహిత్య అకాడమీ, న్యూఢిల్లీ, స్ఫూర్తి సాహితీ సమాఖ్య యానాం సంయుక్తంగా సత్కరించనుంది. బుధవారం ఈ విషయాన్ని నిర్వాహకులు పొనుగుమట్ల విష్ణుమూర్తి, దాట్ల దేవదానంరాజు ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక సమగ్రశిక్ష సమావేశ మందిరంలో అవార్డు గ్రహీతలు డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి (సాహిత్యం), కోరుకొండ ప్రసాదరావు (నాటకం), ముమ్మిడి శ్రీవీరనాగప్రసాద్ (చిత్రకళ), గ్రంధి సత్యనారాయణ మూర్తి (శిల్పం) లను సత్కరిస్తారన్నారు.

గుండెపోటుతో ఎంపీటీసీ మృతి



జల్లి మరియమ్మ (ఫైల్)

అల్లవరం: గూడాల-తాడికోన ఎంపీటీసీ సభ్యురాలు జల్లి మరియమ్మ (47) గుండెపోటుతో ఆమె నివాసంలో బుధవారం మృతి చెందారు. ఉదయం నిద్ర లేచి గదిలో నుంచి బయటకు వస్తుండగా పడిపోయి తుదిశ్వాస విడిచారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆమె వైఎస్సార్ సీపీ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. మృతురాలికి భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మరియమ్మ అకాల మృతికి ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, సర్పంచులు దాకారపు చిరంజీవిరావు, సాధనాల సూర్య వెంకటనాగమణి, ఎంపీడీఓ జి.సరోవరరావు, పార్టీ నాయకులు శ్రద్ధాంజలి ఘటించారు.

చోరీ కేసులో నలుగురి అరెస్ట్

యానాం: చోరీ కేసులో నలుగురిని బుధవారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై శేరు నూకరాజు తెలిపారు. ఈ నెల 2న దరియాలతిప్ప వద్ద ఉన్న కేజీడీ-6 రిలయన్స్ ఇండస్ట్రీస్‌లో ఇనుము ప్లేట్లను దొంగిలించిన కేసులో దరియాలతిప్పకు చెందిన రేవు అజయ్‌కుమార్, రేవు మల్లేశ్వరరావు, దాసరి ధనకేసులు, చప్పిడి వెంకటరమణలను అరెస్ట్ చేసి కోర్టులో ప్రవేశపెట్టగా నిందితులకు రిమాండ్ విధించారన్నారు. మరో నిందితుడు నల్లా రాజు పరారీలో ఉన్నాడన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

అమలాపురం టౌన్: వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని నియోజకవర్గ జనసేన నాయకులు స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా చేశారు. నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి శెట్టిబత్తుల రాజబాబు, నాయకులు సూదా చిన్నా, చిక్కాల సతీష్ పాల్గొన్నారు.

కష్టం.. కన్నీరు

- అకాల వర్షాలతో రైతన్నల దిగాలు
- కళ్లాల్లో తడిసిన పంట

ముమ్మిడివరం/ ఐ.పోలవరం/ కాట్రేనికోన: కష్టం క'న్నీరు' అవుతోంది.. పుడమి పుత్రులకు తీరని వేదన మిగులుతోంది.. అకాల వర్షం కంటి మీదకు లేకుండా చేస్తోంది.. ఆరుగాలం శ్రమించిన పంటను తుడిచి పెట్టేస్తోంది.. కాలామా.. దయచూపుమా! అంటూ రైతన్నల వేదన కంటనీరు రప్పిస్తోంది.. అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల పరిధిలో 48 వేల ఎకరాల్లో రబీ పంట సాగు చేశారు. ఇప్పటి వరకూ 40 శాతం కోతలు పూర్తయ్యాయి. మరో 20 శాతం వరి కోతలు కోసి మాసూళ్లు చేస్తున్నారు. మిగిలిన వరి చేలు నెలకొరిగి నీట మునిగాయి. కళ్లాల్లోనే పంట ఉండటం, వరి పనలు చేలల్లో ఉండటంతో కొద్దిపాటి వర్షానికే తడిసిపోయే ప్రమాదముందని రైతులు వాపోతున్నారు. వాతావరణ శాఖ తుపాన్ హెచ్చరిక జారీ చేయడంతో ఆందోళన చెందుతున్నారు. ఐదు రోజుల కిందట కురిసిన వర్షానికి కళ్లాల్లో ధాన్యం తడిసి ముద్దయ్యింది. ఆ కష్టం నుంచి ఇంకా కోలుకోక ముందే బుధవారం తిరిగి భారీ వర్షం పడడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. టార్పాలిన్లు కప్పి కళ్లాల్లోని పంటను రక్షించుకునే ప్రయత్నం చేశారు. మరోవైపు 6న బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడుతుందని ఐఎండీ హెచ్చరికలతో మరింత ఆందోళన చెందుతున్నారు. బుధవారం ఒక్కసారిగా వాతావరణంలో మార్పు చోటుచేసుకుని వర్షం కురవడంతో రైతన్నలు బెంబేలెత్తిపోయారు. కోసిన పంటను ఒబ్బిడి చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ముమ్మిడివరం, తాళ్లరేవు, ఐ.పోలవరం, కాట్రేనికోన మండలాల్లో ఎక్కడ చూసినా కోసిన పంటను కుప్పలుగా వేయడం, కుప్పలు నూర్చడం, పనలు మోపులు కట్టడం వంటి పనులు చేపట్టారు. ఒకేసారి అన్ని పనులు చేయడంతో అవసరాలకు తగిన కూలీలు దొరక్క రైతులు ఇబ్బంది పడ్డారు. అందరికి ఒకేసారి కూలీల అవసరం రావడంతో కూలి రేట్లు అమాంతం పెంచేశారు. రైతులు ఎంత కూలి ఇచ్చేందుకు సిద్ధపడినా కొరత తప్పడం లేదు. చివరిలో ఉన్న దిగుబడులను దక్కించుకోవాలని రైతులు ఆరాట పడుతున్నారు.

ఐ.పోలవరం మండలంలో రెండు రోజుల నుంచి కురుస్తున్న వానలకు రహదారులు, చేలు, తోటలు చెరువులను తలపిస్తున్నాయి. మండలంలో 7,273 ఎకరాల్లో సాగు చేయగా సుమారు 100 ఎకరాల్లో కోతలు కాలేదు. అధిక సంఖ్యలో రైతులు బొండాలు రకం వేయడంతో రాశులు పోశారు. ఆర్‌బీకేల ద్వారా ఇప్పటి వరకూ 5 వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని కొనుగోలు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. భారీ వర్షాలకు కుప్పలు తడిసిపోకుండా వాటిపై రైతులు బరకాలు కప్పారు. కొమరగిరి ఇటుక బట్టీల్లో పచ్చి ఇటుకలు తడిసిపోవడంతో తీవ్ర నష్టం కలిగిందని యజమానులు వాపోయారు. జి.వేమవరం, గుత్తెనదీవి గ్రామాల్లో వ్యవసాయ అధికారి ఎం.వాణి పంట పొలాలను పరిశీలించి రైతులకు తగు సూచనలు అందించారు. బొండాల రకాల ధాన్యం ఎండలు వచ్చిన తరువాత ఆరబెట్టుకొని అమ్ముకోవాలని సూచించారు. మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోకి వర్షపు నీరు చేరింది. వర్షం నీరు దిగేందుకు సిబ్బంది చర్యలు చేపట్టి భక్తులకు ఇబ్బంది రాకుండా ఏర్పాట్లు చేశారు.



తాళ్లరేవు మండలం పోలేకుర్రులో ధాన్యం రాశులపై బరకాలు కప్పి..



ముమ్మిడివరం మండలం అన్నంపల్లిలో ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకుంటున్న రైతులు

వరి చేల పరిశీలన

కాట్రేనికోన మండలంలో అకాల వర్షాలతో దెబ్బతిన్న వరి పంటను మండల అధికారుల బృందం పరిశీలించింది. కాట్రేనికోన, వేట్లపాలెం, సత్తమ్మ చెట్టు, దొంతికుర్రు, ఉప్పూడి తదితర ప్రాంతాల్లో పర్యటించి తడిచిన వరి చేలను చూశారు. వర్షపు నీటితో మొలకలు వచ్చిన పనలను, రాశులపై, కళ్లాల్లో ఉన్న ధాన్యం మొలకలు రాకుండా ఉపాధి సిబ్బందిచే ఉప్పు ద్రావణం పిచికారీ చేయించారు. ఎంపీడీఓ కామేశ్వరరావు, ఏఓ ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

ఉప్పలగుప్తం: అకాల వర్షాలకు తడిచిన పనలపై 5 శాతం ఉప్పు ద్రావణాన్ని చల్లాలని మండల వ్యవసాయాధికారి జి.కుమార్‌బాబు సూచించారు. భీమనపల్లిలో తడిచిన చేలను తహసీల్దార్ జె.వెంకటేశ్వరి, ఎంపీడీఓ గౌరీకుమారితో కలసి పరిశీలించారు. ఏపీఓ వి.రాజామణి, సివిల్ సప్లయిస్ టీఏ కె.చంద్రమౌళి పాల్గొన్నారు.



వేట్లపాలెంలో మొలకలు వచ్చిన పనలను అధికారులకు చూపుతున్న రైతులు



మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయ ఆవరణలో వర్షపు నీరు

మంత్రి విశ్వరూప్ ఇంట సందడి



మంత్రి విశ్వరూప్‌తో ఎమ్మెల్యేలు, ఎంపీ మిధున్‌రెడ్డి

అమలాపురం రూరల్: భట్నవిల్లి గ్రామంలో రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పినిపే విశ్వరూప్ కొత్తగా నిర్మించిన నివాసంలో బుధవారం గృహ ప్రవేశం జరిగింది. దీనికి రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, అధికారులు పాల్గొని మంత్రి దంపతులను ఆశీర్వదించారు. భట్నవిల్లిలో 216 జాతీయ రహదారిని ఆనుకుని కొత్తగా నిర్మించిన గృహాన్ని మంత్రి విశ్వరూప్ బేబీమీనాక్షి దంపతులు ప్రారంభించారు. ఉభయగోదావరి జిల్లాల రీజినల్ కో-ఆర్డినేటర్, ఎంపీ మిధున్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, హోం మంత్రి తానేటి వనిత, బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, డిప్యూటీ సీఎం, ఎక్సైజ్ శాఖ మంత్రి కె.నారాయణస్వామితో పాటు ఎంపీలు మార్గాని భరత్‌రామ్, చింతా అనురాధ, వంగా గీత, పలువురు ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మరింత పటిష్టంగా పౌర సేవలు

అల్లవరం: సచివాలయాల ద్వారా పౌర సేవలను మరింత పటిష్టంగా అందించాలని జిల్లా పరిషత్ సీఈఓ ఎస్.సత్యనారాయణ మూర్తి అన్నారు. కొమరగిరిపట్నంలోని గ్రామ సచివాలయాన్ని, చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సచివాలయంలో విధులు నిర్వర్తిస్తున్న డిజిటల్, వెల్ఫేర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలతో మాట్లాడారు. ప్రజలకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. వారి పనితీరును మెరుగు పరుచుకోవాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని అధికారులతో కలసి పరిశీలించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం చిన్న, మధ్య పంచాయతీలకు ఆదర్శంగా ఉండాలని అధికారులకు సూచించారు. ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డు పనితీరును మెరుగుపరచాలని సూచించారు. తొలుత అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి, ఎంపీడీఓ జి.సరోవరరావు, కార్యదర్శి ఎన్‌వీవీ సత్యనారాయణ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద అధికారులతో మాట్లాడుతున్న సత్యనారాయణమూర్తి

కన్నుల పండువగా సదస్యం

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ఆత్రేయపురం మండలం ర్యాలి శ్రీజగన్మోహినీ కేశవ స్వామి ఆలయంలోని రామ సత్యనారాయ స్వామి, అదే గ్రామంలో వేంచేసియున్న ఉమాకమండలేశ్వర స్వామివారి ఆలయల్లో బుధవారం సదస్యం కార్యక్రమం కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయాల వద్ద ఉదయం గ్రామోత్సవం జరిగింది. వేదపండితులు, అర్చకులు వేదపారాయణంతో స్వామివారిని ఆశీర్వచనం కార్యక్రమం చేశారు. ప్రత్యేక పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకోవడంతో పాటు మొక్కులు చెల్లించారు. భక్తుల ఇబ్బందులు లేకుండా ఆలయ ఈఓ బి.కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది, ఏర్పాట్లును పర్యవేక్షించారు. ఈఓ మాట్లాడుతూ హైదరాబాద్‌కు చెందిన నల్లాని చక్రవర్తుల వెంకట రామకృష్ణాచార్యులు, అచ్చుతవేదవల్లి తయారు దంపతులు జగన్మోహినీ కేశవస్వామి ఆలయ అభివృద్ధికి రూ.10,116 విరాళం అందించినట్టు తెలిపారు. దాతకు ఆలయ సిబ్బంది స్వామి వారి చిత్రపటం అందజేశారు.



దాతకు స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అర్చకుడు

చెరువు కాదది... వెళ్లే దారిది

తాళ్లరేవు: కాకినాడ- యానాం ప్రధాన రహదారిలోని నీలపల్లి చెక్‌పోస్టు సెంటర్ వద్ద బుధవారం కురిసిన భారీ వర్షానికి ఆ ప్రాంతం ముంపునకు గురైంది. చెరువును తలపించింది. వాహనచోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నీలపల్లి ఎక్సైజ్ చెక్‌పోస్టు ఎదురుగా మోకాలి లోతున వర్షం నీరు నిలిచిపోతుంది. నీరు వెళ్లకుండా ఎవరికివారు తమ వ్యాపార సంస్థలు, ఇళ్ల వద్ద ఎత్తుగా కాంక్రీట్ దిమ్మెలు వేయడంతో ఈ పరిస్థితి వచ్చిందని ప్రజలు అంటున్నారు. తక్షణం ఆక్రమణలు తొలగిస్తేనే గాని శాశ్వతంగా సమస్య పరిష్కారం కాదని చెబుతున్నారు. దీనిపై సచివాలయ సెక్రటరీ, ఆర్అండ్‌బీ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు వైఎస్సార్ సీపీ నాయకులు అరుణ్, ధనకొండ నాగరాజు తదితరులు తెలిపారు.



నీలపల్లి చెక్‌పోస్టు సెంటర్‌లో భారీగా నిలిచిన వర్షపునీరు

నృసింహా స్వామి జయంతికి ఏర్పాట్లు పూర్తి

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానంలో గురువారం నిర్వహించే నృసింహస్వామి జయంతి, స్వామివారి దీక్షా విరమణ కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారి సన్నిధిలోను, కల్యాణ వేదిక వద్ద షెడ్డులో చేయనున్న విశేష కార్యక్రమాలు గురించి చర్చించారు. షెడ్డులో ఏర్పాటు చేసిన మహాశాంతి హోమం పనులను వారు పరిశీలించారు. ఏప్రిల్ 7, 8 తేదీల్లో భక్తులు 27 రోజుల స్వామివారి దీక్ష చేపట్టినట్టు, నృసింహ జయంతి రోజున దీక్షా విరమణ చేయనున్నట్టు రంగాచార్యులు అన్నారు. వేదపండితుడు చింతా వేంకటశాస్త్రి, అర్చకుడు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు
- కుందాలపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం

పి.గన్నవరం: కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలను అందిస్తున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. కుందాలపల్లిలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. మండల శాఖ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, నాయకులు పప్పుల రాంబాబు, పినిశెట్టి శ్రీను, పప్పుల కర్ణ, అంద్రోతు వీవీ సత్యనారాయణ, పప్పుల శ్రీనివాస్ తదితరులతో కలిసి ఎమ్మెల్యే చిట్టిబాబు ప్రజలను కలుసుకుని ప్రభుత్వ పథకాలను వివరించారు. జగన్ పాలనలో కలిగిన ప్రయోజనాన్ని కుటుంబాలకు వివరించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ జగన్ చరిత్ర సృష్టించారని అన్నారు. మన రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పథకాలను ఇతర రాష్ట్రాలు అధ్యయనం చేస్తున్నాయని వివరించారు. స్థానికులు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. పార్టీ నాయకులు దొమ్మేటి దుర్గారావు, జల్లి శ్రీను, పప్పుల నర్సింహస్వామి, కాసర అప్పన్న, తిక్కిరెడ్డి శ్రీనివాస్, కాసర మునలయ్య తదితరులు పాల్గొన్నారు.



కుందాలపల్లి గ్రామస్తులకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అహో... అందాల మేఘమాల



వానపల్లిపాలెంలో ఆకాశంలో అబ్బుర దృశ్యం

ఉప్పలగుప్తం: మేఘమాల.. కనువిందు చేసింది ఇలా.. తెల్లని మేలిమి ఛాయతో ఆహ్లాదాన్ని పంచే మేఘం పసిడి కాంతులతో సరికొత్త రూపాన్ని సంతరించుకుంది. వానపల్లిపాలెంలో బుధవారం సూర్యోదయానికి ముందు చెరువు గట్ల నడుమ ఇలా ఆకాశం ఆకర్షించింది. మబ్బులతో బంగారు వాకిలిలా దర్శనమిచ్చింది. ఆ ప్రతిరూపం చెరువులో పడి మరింత శోభ తెచ్చింది. ఇది పర్యాటక ప్రియులను రంజింపజేసింది.

డీజిల్ అక్రమ రవాణాను అరికట్టాలి

యానాం: కేంద్ర పాలిత ప్రాంతం యానాంలో వివిధ పెట్రోలియం బంకుల నుంచి అక్రమంగా డీజిల్‌ను తరలిస్తున్నారని, దీనిని అరికట్టాలని కోరుతూ బుధవారం సివిల్ సప్లయిస్ అథారిటీ కమ్ ఆర్ఏఓ మునిస్వామికి స్థానిక నాయకులు మాగాపు సుబ్బారావు, సుంకర కార్తీక్ ఫిర్యాదు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ మండలాలకు అక్రమ రవాణా జరుగుతుందని, దీనిని అరికట్టేందుకు పోలీస్ నిఘాను పటిష్టం చేయాలని కోరారు.

కొత్తపేట రెవెన్యూ డివిజన్ ఎమ్మెల్యే కృషి ఫలితమే

కొత్తపేట: కొత్తపేట రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి కృషి ఫలితమేనని ఐఏఎస్ అధికారి, ప్రభుత్వ ప్లానింగ్ సెక్రటరీ జీఎస్ ఆర్‌కేఆర్ విజయకుమార్ అన్నారు. బుధవారం అమలాపురం వచ్చిన ఆయన ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని కలిశారు. ఆర్డీఓ ఆఫీస్ ఎక్కడ ఏర్పాటు చేశారని ఎమ్మెల్యేని అడిగారు. నియోజకవర్గ హెడ్ క్వార్టర్ కొత్తపేటలో ప్రధాన రహదారి పక్కనే ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే చెప్పారు. ఈ సందర్భంగా సెక్రటరీ విజయకుమార్ ఆర్డీఓ ఆఫీస్‌ను సందర్శించారు. ఆయనను జగ్గిరెడ్డి బొకే, శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులతో విజయకుమార్ మాట్లాడుతూ ఈ రెవెన్యూ డివిజన్ రావడానికి ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పట్టుదలే కారణమన్నారు. ఆయన కృషి ఫలితంగా వచ్చిందని తెలిపారు. జగ్గిరెడ్డి మాట్లాడుతూ మీ సహకారం కూడా తోడ్పడింది అని విజయకుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్డీఓ ఎం.ముక్కంటి విజయకుమార్‌ను శాలువాతో సత్కరించారు. అముడ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందవద్దు

తాళ్లరేవు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, మిల్లర్లతో తహసీల్దార్ పోతురాజు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌బీకేల్లో ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా జరుగుతున్నాయని, రైతులు ఆందోళన చెందవద్దన్నారు. పలుచోట్ల అడ్డుకట్టలతో పంట పొలాల్లో నీరు దిగక రైతుల ఇబ్బందులు తమ దృష్టికి వచ్చాయని, ఉపాధి పథకంలో వాటిని తొలగించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు కోసం మండలానికి 5 ట్రాక్టర్లు అదనంగా కేటాయించారని, వాటిని రైతులు ఉపయోగించుకోవాలన్నారు. గోనె సంచుల కొరత లేదని, ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ మల్లాడి భైరవమూర్తి, సూపరింటెండెంట్ మోహనకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాహితీ సేవలు ప్రశంసనీయం



అవార్డు గ్రహీత భాస్కరరెడ్డి సత్కార సభలో పాల్గొన్న కవి దాట్ల, అధ్యాపకులు

యానాం: వృత్తి రీత్యా కళాశాల ప్రిన్సిపాల్‌గా విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తూ మరోవైపు ప్రవృత్తిగా సాహితీ రంగంలో డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి రాణించడం ప్రశంసనీయమని పలువురు పేర్కొన్నారు. బుధవారం పుదుచ్చేరి ప్రభుత్వం నుంచి ప్రతిష్ఠాత్మకమైన కలైమామణి అవార్డు అందుకున్న భాస్కరరెడ్డిని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ప్రముఖ కవి దాట్ల దేవదానంరాజు మాట్లాడుతూ కళాశాల అధిపతిగా తీరిక లేకుండా ఉన్నా తెలుగు అధ్యాపకుడిగా సాహిత్యానికి, సాహితీ సభల నిర్వహణకు భాస్కర రెడ్డి ఎంతగానో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో కొండూరి రామరాజు, అధ్యాపకులు ఆర్‌వీవీ సత్యనారాయణ, యోగేందర్ సింగ్, సిద్దిరెడ్డి శ్రీనివాస్, శాంతకుమార్, దుర్గయ్య, సూపరింటెండెంట్ లోవరాజు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కును కాపాడుకుంటాం..



అమలాపురంలో నిరసన వ్యక్తం చేస్తున్న అఖిలపక్ష నాయకులు

అమలాపురం టౌన్: ఎందరో ప్రాణ త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేట్ పరం కాకుండా కాపాడుకుంటామని అమలాపురంలో అఖిలపక్ష నాయకులు తెలిపారు. స్థానిక గడియారం స్తంభం సెంటర్‌లో అఖిలపక్షం ఆధ్వర్యంలో బుధవారం నిరసన ప్రదర్శన జరిగింది. ఈ ప్రదర్శనతో పాటు ధర్నా నిర్వహించారు. రోడ్డుపై బైఠాయించి కేంద్ర ప్రభుత్వ తీరును ఎండగట్టారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి బీవీవీ కొండలరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.దుర్గాప్రసాద్, సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు, డీసీసీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు, టీఎన్‌టీయూసీ నాయకుడు కుసుమ రామమోహనరావు, వలవల శివరావు తదితరులు పాల్గొన్నారు.

హడలెత్తించిన పొడ పాము



చనిపోయిన భారీ పొడ పాము

తాళ్లరేవు: పి.మల్లవరం పంచాయతీ రాంజీనగర్ వద్ద బుధవారం భారీ పొడ పాము హడలెత్తించింది. అక్కడ పంట కాలువలో కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నాలుగు అడుగుల పొడ పామును కూలీలు గుర్తించారు. దానిని కూలీలు హతమార్చడంతో ప్రమాదం తప్పిందని వార్డు సభ్యుడు కె.వెంకటేశ్వరరావు తెలిపారు.

రోడ్డు విస్తరణ పనుల పరిశీలన

సఖినేటిపల్లి: అంతర్వేది నుంచి టేకిశెట్టిపాలెం వరకూ రూ.25 కోట్లతో చేపట్టిన రహదారి విస్తరణ పనులను బుధవారం రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పరిశీలించారు. కేశవదాసుపాలెం సరిహద్దులో అంతర్వేది ఛానల్‌కు చేస్తున్న రివెట్‌మెంట్ పనులపై కాంట్రాక్టర్‌తో చర్చించారు.